క్లుప్తంగా

నేడు పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

సంగెం: ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని స్థానిక పశువైద్యశాలలో ఆదివారం పెంపుడు కుక్కలకు ఉచిత యాంటి రేబిస్ టీకాలు ఇవ్వనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తామన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన హరిణి



వర్ధన్నపేట : పట్టణ కేంద్రానికి చెందిన తూర్పాటి హరిణి ప్రముఖ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకుంది. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 571 మార్కులు సాధించి మండలంలో మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు బాసర సీటు సాధించడంపై హరిణి తల్లిదండ్రులు సమ్మయ్య–మంజుల, బంధువులు, ఉపాధ్యాయులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సంపేట : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు అన్నారు. పట్టణంలోని గీతాంజలి డీజీ ప్రైమరీ స్కూల్‌లో శనివారం వృక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ తరగతి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులు ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మిథున్, సౌజన్యరావు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నోడల్ ఏజెన్సీ ప్రతినిధుల సర్వే

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి, ఊకల్, రాగన్నగూడెం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వంచే ఏర్పాటు చేసిన నోడల్ ఏజెన్సీ ప్రతినిధులు సర్వే నిర్వహించినట్లు ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఏజెన్సీ ప్రతినిధులు పర్యటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, గ్రామపంచాయతీలు, వ్యక్తిగత నివాస గృహాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ నివేదికను ఆన్‌లైన్‌లో కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రతినిధులైన కె.యాకలక్ష్మి, పి.ఉమలను శాలువాలతో సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీఓ కూచన ప్రకాష్, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వీఓఏలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారావుకు నివాళి



సుబ్బయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంగెం : వరంగల్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు తండ్రి సుబ్బారావుకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. శనివారం మండలంలోని గుంటూరుపల్లిలో సుబ్బారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, పగడాల కాళీప్రసాదరావు తదితరులు వేర్వేరుగా నివాళులర్పించారు.

ఎంపీ బలరాంనాయక్‌ను కలిసిన ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేట : మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు ఉన్నారు.

షెడ్ల నిర్మాణానికి శ్రీకారం

- ఉపాధి హామీ జాబ్‌కార్డులున్న వారికే అవకాశం
- మండలంలో 44 యూనిట్లు మంజూరు



బంజరుపల్లిలో నిర్మాణ దశలో ఉన్న పశువుల పాక

నెక్కొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టాలతో పాటు మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది.ఉపాధి హామీలో జాబ్‌కార్డు ఉన్న వారిని అర్హులుగా గుర్తించి పశువుల కొట్టాల నిర్మాణానికి రూ. 85 వేలు మంజూరు చేస్తోంది. గొర్రెల సంఖ్య ఆధారంగా షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తుంది. పాడి రైతులు పశువుల పాకల కోసం ముందుకు వచ్చేలా ఉపాధి హామీ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

వివిధ గ్రామాల నుంచి దరఖాస్తులు

మండలానికి పశువుల పాకలకు 40 యూనిట్లు, గొర్రెలు, మేకల షెడ్లకు 4 యూనిట్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. కాగా యూనిట్ల కోసం వివిధ గ్రామాల నుంచి అర్హులు దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. బంజరుపల్లి, అప్పల్‌రావుపేట, సూరిపల్లిలకు రెండేసి యూ నిట్లు, అమీన్‌పేట, లావుడ్యా నాయక్ తండా, అజ్మీ రామంగ్యా నాయక్ తండాలకు ఒక్కొక్కటి మంజూరయ్యాయి. అయితే బంజరుపల్లి,అమీన్‌పేట,సూరిపల్లి,గ్రామాల్లో యూనిట్లు పూర్తి దశకు చేరుకున్నాయి. మిగతా చోట్ల నిర్మాణంలో ఉన్నాయి. పశువుల పాకల నిర్మాణానికి ముందుకు వస్తే మరిన్ని యూనిట్లు మంజూరు చేస్తామని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలన్నారు.

దరఖాస్తు చేసుకోండిలా...

పశువుల కొట్టాలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి ముందుగా జీపీ తీర్మానం అవసరం. అనంతరం ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, సంబంధిత పశుసంవర్థక శాఖ అధికారుల నుంచి జీవాలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పెంపకందారుడికి వ్యవసాయ భూమి ఉన్నట్లుగా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొని మండల పరిషత్ కార్యాలయ అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఉపాధి నుంచి జీవాల సంఖ్య ఆధారంగా యూనిట్ కేటాయించి నిధులు మంజూరు చేస్తారు.

పూర్తి వివరాలు తీసుకుంటున్నాం



ప్రభుత్వ పథకాలపై అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధి హామీ సిబ్బంది ద్వారా అర్హుల పూర్తి వివరాలు తీసుకుంటున్నాం. పశువుల కొట్టాలు, గొర్రెలషెడ్ల మంజూరులో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.

– జాకబ్, ఏపీఓ నెక్కొండ

హక్కుల పోరాటాలకు సిద్ధం కావాలి

- జీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి కుమారస్వామి



అభివాదం చేస్తున్న నాయకులు

నల్లబెల్లి : బీసీ కులాలు తమ హక్కుల కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. ఆ సంఘం సమావేశం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీసీ కులస్తులను ఓటర్లుగా మాత్రమే చూస్తున్న అగ్రవర్ణ ఆధిపత్య కులాల వారు రాజ్యాధికారాన్ని అనుభవిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు దక్కకుండా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు మోదీ ప్రభుత్వం ఆమోదించకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఈ విషయాన్ని అడ్డుపెట్టుకొని రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా గ్రామ పాలనను కుంటుపడేస్తుందన్నారు. అనంతరం సంఘం నల్లబెల్లి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సామల దేవేందర్, కో కన్వీనర్లుగా పాండవుల రాంబాబు, మేడిపల్లి రాజు, సద్దాం హుస్సేన్, కోల లింగయ్య, ఒడేల రవి, వైనాల మధు, మారేడుగొండ సదాచారీ, ఉడుత రాజు, గౌరవ సలహాదారులుగా నానబోయిన రాజారాం, వైనాల వీరస్వామి, భోగ భద్రయ్యలను ఎన్నుకున్నారు.

యూరియా కోసం రైతుల బారులు



నర్సంపేట: యూరియా కోసం రైతులు బారులు తీరారు. చెన్నారావుపేట మండలం కోనాపురం సొసైటీ గోదాం వద్దకు శనివారం లారీ యూరియా లోడ్ 444 బస్తాలు రావడంతో విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకొని బారులు తీరి నిలబడ్డారు. దీంతో సొసైటీ ఫీల్డ్ ఆఫీసర్ ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు. దీంతో యూరియా అందని రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. అందరికి సరిపడా తెప్పించి అందించాలని రైతులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పల్లె దవాఖాన వైద్యాధికారి సురేష్‌కుమార్



వర్ధన్నపేట : వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సురేశ్‌కుమార్



ఖానాపురం : ఫీమోపాస్ పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారులు

వర్ధన్నపేట : వానాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పల్లె దవాఖాన వైద్యాధికారి సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కడారిగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం–2 ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 80 మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ వానాకాలంలో కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ముందస్తుగా అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజ, ఆపరంజి, ఆశా కార్యకర్తలు శోభ, కోమల పాల్గొన్నారు.

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటలో శనివారం వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా వంటి పరీక్షలు చేశారు. నీటి నిల్వలు ఉన్నచోట ఫీమోపాస్ మందును పిచికారీ చేయించారు. గ్రామంలో తొమ్మిదేళ్ల బాలుడికి డెంగీ పాజిటివ్ రావడంతో వైద్యసూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో బ్లీచింగ్ పౌడర్‌ను తీసుకొచ్చుకోని చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దామోదర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, ఏఎన్ఎం జ్యోతి, భార్గవి, పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయపర్తి: జూలై 7న గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు మాదిగ, కో ఇన్‌చార్జి ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలోని అంగడి ప్రాంతంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సదస్సును ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా ధర్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రభావం అన్ని అణ గారిన కులాల్లో సామాజి క చైతన్యాన్ని రగిలించిందన్నారు. మండల కో ఇన్‌చార్జ్‌లు కుమార్ మాదిగ, నరేష్ మాదిగ,యాకన్న, కుమార్, రవి, ప్రశాంత్, వీరన్న, రాజు, రవి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల కళ్లలో ఆనందం

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



లబ్ధిదారులకు మంజూరు పత్రం అందిస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ: పదేళ్ల నిరీక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం వ్యక్తమవుతోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అప్పల్‌రావుపేట, మడిపల్లి, గొట్లకొండ గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులు చేపట్టిన ఇండ్ల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేసి, లబ్ధిదారులకు మంజురు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ దశలవారీగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన డబ్బులు జమ అవుతాయని ఆయన పేర్కొన్నారు. పదేళ్లలో ఒక్క ఇళ్లు కూడా ఇవ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల్ని మభ్యపెట్టి మోసం చేసిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, నాయకులు కేవీ సుబ్బారెడ్డి, చెన్నకేశవులు, మహిపాల్‌రెడ్డి, సాయికృష్ణ, శంకర్, శంకర్, భిక్షపతి, అశోక్, ప్రవీణ్, దేవేందర్, నైజాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

దంతవైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో టూత్‌పేస్టులు అందుకున్న మహిళలతో వైద్యులు భరత్‌రెడ్డి, తదితరులు

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి డెంటల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.భరత్‌రెడ్డి అధ్వర్యంలో శనివారం పట్టణంలో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత దంతవైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో 70 ఏళ్లకు పైబడిన 100 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి సుమారు రూ.16,190 విలువ చేసే డీసెన్సిటైజింగ్ టూత్‌పేస్టులు ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ బ్రషింగ్ పద్ధతులు పాటించకపోవడం, అనారోగ్య, పౌష్టికాహార సమస్యల వల్ల దంతక్షయం జరుగుతుందన్నారు. సంవత్సరానికి ఒక్కసారైనా దంత వైద్యున్ని సంప్రదిస్తే కొంతమేరకు నోటి ఆరోగ్య పరిరక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ రాజు, చందునాయక్, హరీష్, కపిల్, మల్లేశం, ఆర్ఎంఓ భరత్, హెడ్‌సిస్టర్స్ మిరియం, ఫ్లోరెన్స్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి యార ప్రశాంత్



అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సంపేట : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి యార ప్రశాంత్ అన్నారు. పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా అవకాశాలను అందించడానికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది ఎవరి భిక్ష కాదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఉన్నత విద్య అందుకుని ఈ సమాజంలో ఉన్నతమైన స్థాయిలో ఉండటం ద్వారానే సమాజాభివృద్ధి అన్నారు. ఆరేళ్ల నుంచి రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బకాయిలను విడుదల చేయాలని, లేదా రాష్ట్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పైస గణేష్, బానోతు వినోద్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వై.కార్తీక్, తరుణ్, తరుణ్‌కిరణ్, కిశోర్, సుమన్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు



మాట్లాడుతున్న ఉషాదయాకర్‌రావు

పర్వతగిరి : బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలో శనివారం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయని, ఈసారి వంద ఎమ్మెల్యే సీట్లు గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం దిశగా కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అబాసు పాలవుతుందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మండల ఇన్‌చార్జ్ జోరిక రమేష్, సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పంతులు, స్థానిక మాజీ సర్పంచ్ సోమేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, ఎంపీటీసీ ఇన్‌చార్జ్‌లు బుద్దె వెంకన్న, రాజు, భిక్షపతి, మాధవరావు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సఖి సెంటర్ సేవలపై అవగాహన

నర్సంపేట : సఖి సెంటర్ సేవలు, రక్షణ చట్టాలపై మహిళలకు చెన్నారావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రం, బీఎల్ఓ సమావేశంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ కేస్ వర్కర్ స్వప్న, ఉమెన్ హబ్ నుంచి జెండర్ స్పెషలిస్ట్ హర్షిత మాట్లాడుతూ సఖి సెంటర్ మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో సఖి కేంద్రం పని చేస్తుందని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను ఉచితంగా 24 గంటలు అందుబాటులో ఉంటూ అందిస్తామన్నా రు. గృహహింస, బాల్య వివాహాల నిరోధక, పోక్సో, సీనియర్ సిటిజన్స్ చట్టం అత్యవసర సమయాల్లో ఉయోగించాల్సిన టోల్‌ఫ్రీ నంబర్స్ 100, 181, 1098,14567 వంటి వాటిపై అవగాహన కల్పించారు.

రైతు సేవలే లక్ష్యం



డీసీసీబీ ఆవరణలో మొక్కలతో చైర్మన్లు

నెక్కొండ : రైతు సేవలే లక్ష్యంగా సహకార సంస్థలు పని చేస్తున్నాయని నెక్కొండ, అమీనాబాద్ పీఏసీఎస్ చైర్మన్లు మారం రాము, మురహరి రవి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా స్థానిక డీసీసీబీ ఆవరణలో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీతోపాటు, స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలు, కర్షక రుణాల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. దీంతో సహకార సంస్థలు బలోపేతం అవుతాయని వారు పేర్కొన్నారు. రెడ్లవాడ, సూరిపల్లి పీఏసీఎస్ చైర్మన్లు జలగం సంపత్‌రావు, ఘంటా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

నిర్మాణ స్థలంపై చర్చించిన నాయకులు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం స్థల సేకరణ ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ విజయ్‌సాగర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలం గురించి, స్థల సేకరణ ప్రక్రియ గురించి చర్చించారు. పాఠశాల ఏర్పాటుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నర్సంపేట: భారత ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు జన్మదిన వేడుకలను జిల్లా బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకురాలు నల్ల భారతి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ కార్మిక పక్షపాతిగా నిరంతరం ఉంటూ కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ జన్మదిన వేడుకలను కార్మికుల సమక్షంలో జరుపుకోవడం సంతోషకరం అన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలి

- తహసీల్దార్ ఆబిద్ అలీ



నర్సంపేట : శిక్షణలో పాల్గొన్న తహసీల్దార్ ఆబిద్‌అలీ



నెక్కొండ: అధికారులతో బీఎల్‌ఓలు

నర్సంపేట: బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా సవరణకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా అమలు చేసి అర్హత గల ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ మహమ్మద్ ఆబిద్‌అలీ అన్నారు. చెన్నారావుపేటలోని రైతు వేదికలో శనివారం ఓటర్ల జాబితా సవరణపై పోలింగ్ బూత్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్, శిక్షకులుగా నర్సంపేట అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు పిన్నింటి బాలాజీరావు, గూడూరు కిరణ్‌లు వ్యవహరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ఇంటింటికి సర్వే చేసి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కును పొందే విధంగా చూడాలని కోరారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం చేయాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ జి.కిరణ్ బూత్ లెవల్ అధికారుల బాధ్యతలు, విధులు, ఎన్నికల కమిషన్ సూచనల గురించి వివరించారు. మాస్టర్ ట్రైనర్ పిన్నింటి బాలాజీరావు వివిధరకాల ఫారాల గురించి రోల్ ప్లే ద్వారా స్వయంగా బీఎల్‌ఓలు పూరించేలా శిక్షణను ఇచ్చారు. ఢిల్లీకి వెళ్లి ఎలక్షన్ కమిషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ పొందిన రాజేష్ తన శిక్షణ అనుభవాలను పంచుకున్నారు. బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల పాత్ర కీలకం

నెక్కొండ: ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. నెక్కొండ హైస్కూల్‌లో శనివారం బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితా తయారీ, నవీకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ హాజరై మాట్లాడుతూ జాబితాలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ నరేందర్, మాస్టర్ ట్రైనర్‌లు ఎల్. సుధాకర్‌రావు, ఎస్. సతీష్‌కుమార్, కే. రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



ఏపీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సంఘం నాయకులు

నర్సంపేట రూరల్ : ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం (సీఐటీయూ) మండల అధ్యక్షుడు నర్ర నాగరాజు అన్నారు. ఎంపీడీఓ అధికారి శ్రీనివాస్, ఏపీఓ ఫాతిమా మేరీలకు సమ్మె దేశ వ్యాప్త ఒకరోజు సమ్మెను నోటీసను శనివారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రోజు రోజుకి ఉపాధి హామీ నిధులను తగ్గించడంతోపాటు కొత్త కొత్త సాఫ్ట్‌వేర్ల పేరుతో వివిధ రకాల యాప్‌లను ప్రవేశపెట్టి సిబ్బందితోపాటు ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు ఇబ్బందు కలిగిస్తున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల కార్యదర్శి శ్రీను, జంపయ్య, సురేందర్, చందర్‌రెడ్డి పాల్గొన్నారు.